క్లుప్తంగా

హిందూ ధర్మపరిరక్షణకు కృషి


హిందూ ధర్మ ప్రచారం కోసం సహాయం అందిస్తున్న మాతృమూర్తులు

పరవాడ: హిందూ ధర్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి ఇందిరాదేవి, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. లంకెలపాలెం రామాలయ కేంద్రంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. హిందూ ధర్మ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లడం, ఇబ్బందులను తెలుసుకోవడం, వారానికి ఒక సారి భజన కార్యక్రమం, నెలకొక సారి సామూహిక హారతి వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పెదపాటి రామచంద్రరావు, గనిరెడ్డి శ్రీను, మాతృమూర్తులు కె.ఈశ్వరమ్మ, పెదపాటి సుజాత, జి.కుమారి, ఎస్.కళావతి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పినగాడిలోని శ్రీ గణేశ పార్వతీ సమేత చోడేశ్వర స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉదయం స్వామికి రుద్రాభిషేకం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: రక్తదానం ఎంతో గొప్పదని, ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత కోరారు. సుజాతనగర్‌లో భగవాన్ శ్రీ సత్యసాయి భక్త బృందం పర్యవేక్షణలో, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అన్ని దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని, అత్యవసర పరిస్థితిలో ఉన్న వారికి అందుబాటులో ఉండేలా రక్తదానం చేయాలని కోరారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ యు. జీవన్ సంతోష్, డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ 45 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, సత్యసాయి భక్తబృందం ప్రతినిధులు బి.జ్యోతి, హెచ్.బుజ్జిబాబు, హెచ్. ప్రమీల, ఎం.గోపి, సీహెచ్. శ్రీనివాసరావు, పి.తాతారావు, సీహెచ్. రవిశంకర్, టి.సీతారామయ్య పాల్గొన్నారు.


చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ ఈశ్వరరావు

పరవాడ: తాడి ఉజ్వల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తాడి మూడు మదుముల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన ఉజ్వల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు, ట్రస్టు చైర్మన్ సోమరాజు, మాజీ సర్పంచ్ పితాని నీలకంఠరావు, కోమటి సూరిబాబు, కె.శివాజీ, జి.రాము, జె.ప్రసాద్, బి.నాగేశ్వరరావు, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చకచకా..

ఉగాదినాటికి ప్రవేశాలకు సన్నద్ధం


చురుగ్గా గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు


అమృతపురం వైఎస్సార్ కాలనీలో గృహ నిర్మాణాలు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని లేఅవుట్‌లలో తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. గృహ నిర్మాణ శాఖ ఈ ఉగాది నాటికి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు పూర్తి చేయడం లక్ష్యంగా పనిచేస్తోంది. మండలంలోని పలు శాఖల అధికారులు,సచివాలయాల సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తోంది.పీఎంఏవై–వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి సాయం సత్వరం అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. గృహ నిర్మాణం చేపట్టే లబ్ధిదార్లకు రూ.1,80,000 ప్రభుత్వం నుంచి అందించనున్నారు. దీంతో పాటు డ్వాక్రాలో ఉండే మహిళలకు రూ.35 రుణ సహాయంతో పాటు 20 టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తున్నారు. గృహ నిర్మాణానికి అవసరమయ్యే 90 బస్తాల సిమెంట్, 485 కిలోల ఇనుము రాయితీపై ఇస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

గృహ నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ ఉచిత తాగునీటి కుళాయిలే ఏర్పాటు చేయనున్నారు. అన్ని కాలనీల్లో వీధిరోడ్లు, సామాజిక అవసరాలకు తగిన విధంగా పాఠశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గృహ నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి.

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో మా సొంతింటి కల సాకారమయ్యింది. ప్రభుత్వం ఇంటి స్థలంలో పాటు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు అవసమయ్యే నిధులు విడుదల చేయడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. కాలనీలో అందరి కంటే ముందుగా నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం నివాసం ఉంటున్నాం. గతంలో ఉమ్మడి కుటుంబంలో అందరం ఒకే ఇంట్లో ఇబ్బందులు పడుతూ నివాసం ఉండేవారం. చదువుకుంటున్న పిల్లలతో కలిసి నిచ్చింతగా సొంతింట్లో ఉంటున్నాం.

– గండి రమాదేవి, అమృతపురం, సబ్బవరం మండలం.

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుల బృందం

డాబాగార్డెన్స్: విశాఖ స్మార్ట్‌సిటీ లయన్స్‌క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కళాకారుల మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 300 మంది కళాకారులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ కృష్ణ హారిక, సాయి లక్ష్మి, కృష్ణకీర్తి, ఉమా ప్రవల్లిక పాల్గొని అవసరమైన పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీప్రభ ఆ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా స్మార్ట్‌సిటీ అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాజు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ రోహిణిరాజు, క్యాబినెట్ సెక్రటరీ యు. జానకీదేవి, కోశాధికారి ఐఎస్ఎన్ రాజు, ఎం. విజయలక్ష్మి, ఎం. గోపాల్, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తి


752వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులనద్దేశించి మాట్లాడుతున్న మస్తానప్ప

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప అన్నారు. ఈ మేరకు 752వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వై.మస్తానప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోడీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలనాన్నరు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో నక్షత్రమాల


కృష్ణ భగవానునికి పూజలు చేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షతాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ఠ మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయక సమస్య గ్రంథంతో రైతులకు ఊరట


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం క్లార్ కౌట్స్కీ రచించిన వ్యవసాయక సమస్య గ్రంథం ఎంతో ఊరటనిస్తోందని పరిశోధకుడు విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో వ్యవసాయక సమస్య తెలుగు అనువాద గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేయడం అనేది ఆధునిక రాజ్యం లక్షణమని, అందుకు జలయజ్ఞమే ఓ ఉదాహరణ అని చెప్పారు. వ్యవసాయం ఒకసారి పెట్టుబడిదారీ వలయంలో చేరుకున్న తర్వాత రైతు శ్రమని రైతు ఉపయోగించుకోలేని పరిస్థితిని సృష్టిస్తుందన్నారు. మరో వక్త జగన్నాథస్వామి మాట్లాడుతూ కార్మిక వర్గంతో చిన్న రైతు కలసి ప్రయాణం చేయడం ద్వారా మాత్రమే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలకు సామాజికవేత్తలతో పాటు విద్యార్థులు కూడా శాస్త్రీయ పరిష్కారం కనుగొనాలంటే ఈ గ్రంథం తోడ్పడుతుందన్నారు.

మంచిగా జీవించండి


ఫోర్త్ టౌన్ పీఎస్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, సమాజంలో మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, ప్రమీల, వెంకటరావు, మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి మంచిగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్ల దినచర్యపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక దర్శనాలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పాల్గుణ మాసం ఆదివారం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సీతంరాజుకు మద్దతుగా విస్తృత ప్రచారం


98వవార్డులో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు తదితరులు


బంగారమ్మపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


93వవార్డులో ప్రచారం నిర్వహిస్తున్న దాసరి రాజు

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు కోరారు. వార్డు పరిధి అప్పన్నపాలెంలో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వై ఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో 522 సచివాలయ కన్వీనర్లు పీతల విష్ణు, గొన్న సునీత, కంచుబోయిన సింహాద్రి, కానూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ నుంచి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు కోరారు. మండలంలోని వంగలి,టెక్కలిపాలెం, రాయపుర అగ్రహారం,టెక్కలిపాలెం,బంగారమ్మపాలెం గ్రామాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: జీవీఎంసీ 84 వార్డు సాలాపువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ కన్వీనర్లు సాలాపు సంతోష్, శ్రీను ,అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు కోరారు. వార్డు పరిధి శ్రీనివాస్‌నగర్, వెంకటాద్రినగర్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు కనకరాజు, నక్క శ్రీను, బుడత అప్పలరాజు పాల్గొన్నారు.

➡ సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. వార్డు పరిధిలోని సుజాతనగర్ 80ఫీట్ రోడ్డు, ఎన్ఏడీ లేఅవుట్, ఎల్.ఎస్.నగర్ ప్రాంతాల్లో ఆదివారం పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డి పద్మ, ఆకుల వాసు, అత్తికి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతం సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి హారతులు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ సేవని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పల్లెల్లో పండగల సందడి

• ముస్తాబైన ఆలయాలు


పోలమాంబ అమ్మవారు


ముత్యమాంబ అమ్మవారు


పరవాడ పైడిమాంబ


పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు, బారికేడ్లు

పరవాడ: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ముత్యాలమ్మపాలెం ముత్యమాంబ, పరవాడ పైడిమాంబ, దేశపాత్రునిపాలెం పోలమాంబ, తానాం పరదేశిమాంబల పండగను ఆయా గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం వేకువ జాము నుంచి గ్రామ దేవతలను దర్శించుకునే భక్తుల కోసం ఆలయాల ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పుర వీధుల్లో రంగురంగుల సెట్టింగులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఆలయాల వద్ద షామియనాలు, బారికేడ్లను సిద్ధ చేశారు. మంచినీరు, మజ్జిగ సరఫరా చేయడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. పండగ సందర్భంగా పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో రెండు రోజుల నుంచి మండల స్థాయి క్రికెట్, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్, షటిల్ టోర్నమెంట్ పోటీలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేశపాత్రునిపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను సీఐ పి.ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పోలమాంబ యూత్ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు గ్రామ దేవతలకు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.



దేశపాత్రునిపాలెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ ఈశ్వరరావు

కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా సుదర్శనరావు


ఆచార్య సుదర్శనరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఆర్.సుదర్శనరావు ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ నెల 27, 28 తేదీలలో తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో నిర్వహించే 39వ వార్షిక సదస్సులో ఆయన అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. సదస్సులో మూడు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వృద్ధి, నూతన విద్యా విధానం, రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక ప్రగతి అనే అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తారు. ఈ సందర్భంగా ఆచార్య సుదర్శనరావును విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

అనంతుని రథోత్సవం నేడు


అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం రాత్రి పది గంటలకు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను రథం పైకి తోడ్కొని వస్తారు. విశేష పూజల తర్వాత రాత్రి 11 గంటలకు గాలి గోపురం వద్ద రథోత్సవం ప్రారంభమవుతుంది.